# ప్రతిమ

జమీందారుగారి మేనల్లుడికి జబ్బు చేస్తే రాత్రికి రాత్రి బయలుదేరదీసి, కారులో మద్రాసుకు తీసుకెళ్ళి పెద్ద స్పెషలిస్టుకి చూపించేయడమూ; మైకా మేగ్నేటు పరహాలయ్యంగారి అమ్మాయికి సమ్మర్‌లో డెలివరీరోజులు వస్తే, ఊటీలో చల్లగా ఉంటుందని తీసుకెళ్ళి డెలివరీ చేయించేయటమూ; యువరాజాగారు ఢిల్లీలో పార్టీ యిస్తున్నారంటే పదిమందికి ఫస్ట్‌క్లాస్ బుక్ చేయించి పార్టీకి తీసుకెళ్ళడమూ; మద్రాసులో జడ్జీగారబ్బాయికి పెళ్ళయితే కలకత్తానుంచి బ్రహ్మాండమైన బహూమతులు తెప్పించి ఇచ్చేయటమూ; మినిష్టరుగారి మనమడు ఇంగ్లండ్ వెడుతూంటే, బొంబాయిదాకా వెళ్ళి సెండాఫ్ ఇచ్చేయటమూ; సమ్మర్‌లో ఈ వెధవ ఎండకు తట్టుకోలేక కాష్మీర్‌లో కాంప్, పదిరోజుల తర్వాత నయన్‌తాల్‌కి కాంప్ మార్చేయటమూ; కోటిమూర్తి గారి భార్య పుట్టినరోజయితే మూడు వేల రూపాయల చీరె తెప్పించి బహూమతి ఇవ్వటమే కాక, ఆ అకేషన్‌ని గ్రాండ్‌గా సెలిబ్రేట్ చేయటమూ; ఇంటికి బరోడా రాజాగారి ఫాయిదాలో అమర్చేందుకు వలసిన సన్నాహమూ – ఇదీ నే నెరిగిన విలాసరావు పూర్వకథ.

మద్రాసులో ఓల్డ్ మాంబళంలోని ఒకానొక ఇరుకు వీధిలో ఒక చీకటిలాంటి గది – గదిలో అటూ ఇటూ విసిరివేయబడ్డ చినిగిన చొక్కాలు. ఒక చాప, దానిమీద నల్లగా మాసిన దిండు. పాలవాడికి అప్పు. హోటలువాడికి బాకీ, గది అద్దె తొమ్మిది నెలలకు పైగా ఇవ్వనందుకు యజమాని ఈసడింపులూ, చాకలివాడి బెదరింపులూ, మంగలికి ఇన్‌స్టాల్‌మెంటులో ఇచ్చి గడ్డంగీయించుకోవడం, కిళ్ళీకొట్టువాడు గదికి తిరగని రోజంటూ లేకపోవడం, రైల్లో టికెట్ లేకుండా ప్రయాణం చేయటం, కనబడ్డ ప్రతి వ్యక్తినీ చేయిచాచి అడగలేకపోవటం, తన జీవితాన్ని చూసి 'ఛీ ఛీ' అని చిరాకుపడటం – ఇదీ, నేను విన్న విలాసరావు ప్రస్తుత కథ.

ఈ రెండు కథలకీ మధ్యదూరం సుమారు ఇరవైయ్యేళ్ళు – విలాసరావు గురించి నేను వినని సుదీర్ఘమైన కాలం!

---

గోవిందరాజు శ్రీనివాసమూర్తి

ప్రస్తుత కథని నేను నమ్మలేక పోయాను కాని నా మిత్రుడు సుబ్బారావు కళ్ళారా చూసి చెప్పిన విషయాల్ని నే నెలా నమ్మకుండా ఉండేది – నిజమే నేమో!

"నేనూ నిజంగా నమ్మలేకపోయాను. ఒకనాడు హఠాత్తుగా మౌంట్ రోడ్ లో కనుపించాడు. భుజంమీద చినిగిన చొక్కా, పాతబడిన చెప్పులూ – ముందు తమాషాకి ఈ వేషం వేశాడేమో నను కున్నాను. నన్ను చూసి గుర్తుపట్టాడు. 'సుబ్ రావ్' అని పలకరించాడు. అత డింటికి రమ్మని పట్టుబట్టాడు. 'టాక్సీ' అని పిలవబోయి 'వెధవ టాక్సీలు, తిరిగి తిరిగి విసుగుబుట్టింది. బస్ లో వెడదాం. జస్ట్ ఫర్ యే ఛేంజ్' అన్నాడు. ఇద్దరం మాంబళంకేసి బయలుదేరాం. బస్ టికట్లు నేనే తీసుకున్నాను." అన్నాడు సుబ్బారావు.

"నీకు బస్సేంఖర్మ. టాక్సీలు లేవూ?" అన్నాను.

"జస్ట్ ఫర్ యే ఛేంజ్" అంటూ నవ్వాడు సుబ్బారావు.

"నిజంగా నీవు నమ్మలేవు. అసలే ఇరుకు సందులు. అంతకన్న ఇరుకైన సబ్ – సందు. అందులో విసిరేసినట్టు ఓ మూలగది. పైన మెంగుళూరు పెంకులు. అదీ అతడి నివాసస్థానం. మొదట ప్రాక్టికల్ జోక్ అనుకున్నాను. కాని, రూమ్ కి వెళ్ళిన వెంటనే, పాలవాడో ఎవడో వచ్చి చిన్న తగాదాకు దిగిం తర్వాతకాని విలాసరావు పతనావస్థ అర్థం అయిందికాదు."

"నాకింకా నమ్మకం కుదరటంలేదు." అన్నాను.

"రూంలో కుర్చీలు లేవు. ఒక చాపను దులిపి దానిమీద నన్ను కూచో బెట్టి తను పెట్టెమీద కూచున్నాడు. అతడి ధోరణి చిత్రంగాఉంది. ఎక్కడా దిగజారిపోయినవ్యక్తిగా కనుపించలేదు. చాలా ఆహ్లాదంగా నవ్వుతూ కబుర్లు చెప్పాడు. యువరాజాగారు గతించి పదేళ్ళపైగా అయినా, ఆయన సంతతి తనను వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రాంమీద టెలిగ్రాం ఇస్తున్నారనీ, ట్రావెన్ కూరులో మునుపటి స్నేహి తుడు సంబంధమొదలియార్, తనతో కొన్ని రోజులు గడపవలసిందిగా రోజు కొక ఉత్తరం రాస్తున్నాడనీ ... ఇలాం టివే విరామం లేకుండా చెప్పాడు ..." అన్నాడు సుబ్బారావు.

నమ్మతగిన విషయాలే మరి. విలాస రావులో ఆ శక్తి ఉంది. అతణ్ణి ఇరవై యేళ్ళ క్రితం కుమార్ రాజాగారి ఇంట్లో కలుసుకున్నాను. అప్పు డతనికి ముప్పై లోపు వయస్సు ఉండవచ్చు. పచ్చగా, కొనదేరిన నాసికతో నాజూకుగా ఉండే వాడు.

" 'ఈయన విలాసరావుగారని మహా పండితుడు. ప్రపంచంలో ఈయనకు

తెలియని సంగతి లేదు,' అంటూ పరిచయం చేసారు కుమార్ రాజాగారు.

" 'అదే వద్దంది. కనీసం బొట్టయినా లేదు. పండితుడ నంటావేమోయ్... ఇక ప్రపంచం మాటా, అందులో నాకు తెలిసిన సంగతీ అంటూ లేదు,' అని ఘొల్లున నవ్వాడు విలాసరావు.

"ఆ నవ్వులో మూర్తీభవించిన అందం ఉంది. మనిషిని ఆకట్టుకునే శక్తి ఉంది. ఆయనకేసి అలాగే చూస్తూ ఉండిపోయాను.

" 'ప్రపంచం, సంఘం, చట్టుబండలూ అంటూ ఏవో కబుర్లుచెప్పితే నాకు మహా చిరాకు. కబుర్లలో చెప్పేది కార్యరూపేణా చేస్తే అందులోని తన్మయత్వం ఇంకా కుర్రవాడు కుమార్ రాజాకు అర్థంకాదు.'

" 'అంటే నేను కార్యాచరణ శూన్యుడననేనా మీ భావం,' అన్నాడు కుమార్ రాజా.

" 'చూశావా, గుమ్మడికాయదొంగ ఎవరంటే భుజాలుతడుముకున్నట్టు-ఇప్పుడు నాకు చీట్లాడాలని ఉన్నది. కార్యరూపములో పెడితే నేగాని ఇహ నిద్రపట్టి చావదు,' అన్నాడు విలాసరావు.

" 'సై' అన్నాడు కుమార్ రాజా.

" 'మీరూ?' అనడిగాడు నన్ను విలాసరావు.

" 'ఊఁ, కానీయండి,' అన్నాను.

"మ రెవరో నాకు తెలియని వ్యక్తి కూడా మాతో చేరాడు. షోకి పందవంతున నిర్ణయించి ఆట మొదలెట్టాం. అరగంటలో మూడు నాలుగువేలు అటూఇటూ తిరిగినై. విలాసరావు జేబులోంచి నోట్లు తీస్తూనే ఉన్నాడు. అవి కరిగిపోతూనే ఉన్నవి.

"ఇంతలో ఆయనకు టెలిఫోన్ వచ్చింది. వెళ్ళి మాట్లాడి తిరిగివచ్చాడు.

"మినిష్టరుగా రబ్బాయ్ ఇంగ్లండ్ వెడుతున్నాట్టోయ్ కుమార్ రాజా. రేపు బొంబాయి వెళ్ళాలి. నీ విదేశయాత్ర ఎప్పుడు?' అన్నాడు విలాసరావు.


" 'వేరే పనిలేకనా?' అన్నాడు కుమార్ రాజా.

" 'పనిలేకకాదు, చావలేక. అయినా అక్కడికి వెళ్ళిమాత్రం ఏంచేస్తావులే. ఏ గుర్రప్పందాలో చూసి రావటమో, లేక ఏ చీట్లాటక్లబ్ ఓపెన్ చేయటమో తప్ప.'

"కుమార్ రాజా చిన్నపుచ్చుకోలేదు. పైగా పగలబడి నవ్వాడు. ఆయనతో విలాసరావుకు గల చనువుకు ఆశ్చర్యపోయాను.

"మరో రెండుగంటలల్లో విలాసరావు జేబులు ఖాళీ అయిపోయినై. 'ఇవాళ నిద్రలేచి కుమార్ రాజా మొఖం చూశాను. అంతా దురదృష్టమే,' అని కిలకిలా నవ్వాడు విలాసరావు.

"నేను తీసుకెళ్ళిన డబ్బుకాక పైగా




వచ్చిన మూడువేల రూపాయలూ జేబులో వేసుకుని ఇంటికి తిరిగొచ్చాను.

"తర్వాత విలాసరావు పదిరోజులు కనుపించలేదు. కుమార్‌రాజాను అడిగితే 'ఆయనెక్కడుంటాడు. ఇవాళిక్కడ, రేపు ఢిల్లీ, ఎల్లుండి త్రివేండ్రమ్ — మర్రోజు నయన్‌తాల్. ఆయనెక్కడుండేదీ ఆయనకే తెలియదు.' అన్నాడు.

"'ఏం చదువుకున్నాడు?' అన్నాను.

"ఒకవ్యక్తి అంతస్తును (జమీందారీ వంశం కాకపోతే) చదువుతో బేరీజు వేయటం నాకు మొదటినుంచీ అలవాటు. మంచి అలవాటు కాదని తెలిసికూడ అలా అడిగాను.

"'స్నేహం అంటే ఏమిటో చదివి చదివి డాక్టరేట్ పుచ్చుకున్నాడేమో!' అని చిత్రమైన జవాబు చెప్పాడు కుమార్‌రాజా.

"ఇంకా విన్నదేమంటే విలాసరావుకు పెళ్ళికాలేదు అప్పటికి.

"'పెళ్ళంటే మహాచిరాకోయ్ నాకు. స్వేచ్ఛగా తిరిగే అడివిపక్షిని తెచ్చి పంజరంలో బంధించినట్టే. మహామహావాళ్ళే పెళ్ళాం వల్లో చిక్కుకున్నారు!' అదీ పెళ్ళిగురించిన ఆయన అభిప్రాయం.

"వారంరోజుల తర్వాత ఒక అర్ధరాత్రి తలుపుచప్పుడయితే ఎవరో అర్థంకాక వెళ్ళి తలుపుతీశాను. ఎదురుగా విలాసరావు!

"అంతకుముందు ఆయనతో నా స్నేహం ఒక్కరోజులో కొద్దిగంటలు మాత్రమే. ఆ స్వల్పస్నేహాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి వచ్చి తలుపుతట్టటం సభ్యతా, అసభ్యతా అన్న విషయమై ఆయన ఆలోచించలేదేమో మరి!

" 'అర్ధరాత్రి వచ్చానని ఆశ్చర్యపోతున్నారు కదూ? అవతల అంత గంద్రగోళం జరుగుతూంటే హాయిగా ఎలా నిద్రపోతున్నావయ్యా పండితా? అన్నాడు

"ఆ ధోరణి చూసి ఆశ్చర్యపోయాను

" 'ఏమిటి? ఏం జరిగింది?' అన్నాను అప్పటికి ఆయన లోపలకు చొచ్చుకుని వచ్చేశాడు

" 'ఏం జరిగిందా!' ఘొల్లున నవ్వాడు అర్ధరాత్రి కావటం మూలాన ఆ నవ్వు ఇల్లంతా ప్రతిధ్వనించింది.

" 'ఏంజరిగిందా! — కోటిమూర్తిగారి వైఫ్ బర్త్‌డే అని తెలీదుటయ్యా అన్నట్టు అసలు కోటిమూర్తి ఎవరని అడగకు. ఆంధ్రదేశానికి బిర్లా, కోటిపల్లికి తాతా. ఆయనవైఫ్ బర్త్‌డే. ఇప్పుడు ఒంటిగంటకు హాపీరిటర్న్ చెప్పాలి హర్రీఅప్,' అన్నాడు.

"కోటిమూర్తిగారి వైఫ్ బర్త్‌డే అంటే ఆరోజు ప్రపంచానికంతా పండుగ కాదుటయ్యా అన్నంత ధీమాగా చెప్పాడు

" 'కోటిమూర్తిగారితో నాకు పరిచయం లేదు. పిలవని పేరంటానికి నే నెందుకు?' అన్నాను.

"ఇందుకు విలాసరావు ఒక్క క్షణం ఆశ్చర్యపోయినట్టు కనుపించాడు

" 'నా స్నేహితుడు నీ స్నేహితుడు కాదుటయ్యా వేరే పిలవాలా?—అదిగో, అంతపట్టింపే ఉంటే నేను పిలుస్తున్నాను, రా . . ఊ — బయలుదేరు,' అంటూ ఒక్కతోపు తోశాడు.

"ఇక మాట్లాడేందుకు ఆస్కారం లేక పోయింది నాకు పదినిమిషాల్లో ఆయనతో బయలుదేరాను

"కోటిమూర్తిగారింటికి వెళ్ళేప్పటికి ఒంటిగంట కావస్తున్నది ఇల్లంతా కోలాహలంగా ఉంది. ఆహూతులు వస్తున్నారు ఆమె 'థేంక్యూ' అని సుతారంగా జవాబిస్తున్నది

"అందరిమాటా ఏమోగాని విలాసరావు ప్రవేశానికి ఒక ప్రత్యేకత ఉన్నది తుపాకిగుండులా దూసుకుని ఆమెవద్దకు వెళ్ళి హాపీరిటర్న్స్‌తో ఆమెను ముంచెత్తేశాడు. ఆహూతుల్లో కొందరు విలాసరావును తెలియనివారు 'ఎవ రాయన? ఎవరాయన?' అని గుసగుస లాడుకోవటం నేను విన్నాను.

"నేను ఇవతలకి తప్పొచ్చుకుంటూండటం చూసి 'రావయ్యా, పండితా . . . అలా దిక్కులు చూస్తావేం?' అంటూ నన్ను దగ్గరకు పిలిచి 'ఇతడు నా మిత్రుడు పూర్తి పేరు నాకూ తెలియదు చీట్లాటలో ఇరవడి కితదేసాటి — పండితా, ప్రతిమాదేవి,' అని నన్ను ఆమెకు పరిచయం చేశాడు

"అప్పుడే తలెత్తి ఆమెను చూశాను ఆమె అందానికి నిశ్చేష్టుడ నయ్యాను కోణార్కాలయ నిర్మాతా, మహాశిల్పి అయిన విశ్వదేవుడే, తాను మలచిన

నర్తనాలయంలోని విగ్రహానికి ప్రాణం పోసినట్లుగా ఉన్నది ఆమె. ఆమె బంగారు వర్ణంలో ఒక కాంతి ఉన్నది. కవిని కాదుకాబట్టి ఆమె అందాన్ని అంతకన్న వర్ణించలేను. అలాగే ఆమెను చూస్తూ ఉండిపోయాను.

"'అలా మింగేసేట్టు చూడకు. దిష్టి తగులుతుంది.' అన్నాడు విలాసరావు.


"ప్రతిమాదేవి ఫక్కున నవ్వింది. ఆ పలువరస గుర్తుకువస్తే ఈనాటికీ నా వళ్లు పులకరిస్తుంది.

"'అయితే, ఇవాళ చీట్లాడాల్సిందే' అన్నది ప్రతిమాదేవి.

"ఇక్కడే నాకు బాధకలిగింది. చీట్లాడే వ్యక్తిగా నన్ను పరిచయం చేసిన విలాసరావంటే నాకు చిరుకోపం వచ్చింది.

"ప్రతిమాదేవి నాలుగు అడుగులు వేసింది. రాజహంసఅందే ఇలాగే ఉంటుంది కాబోలు! ఆమెకు ముప్ఫై యేళ్లకు పైగా ఉండవచ్చు. పూర్తిగా జరీపోసిన చీరె కట్టుకుని, సన్నటి లిప్‌స్టిక్ పెట్టుకుని, కొంత పూర్వకాలపు వాసనలూ (ముద్దులూ, వగైరాలు), కొంత అధునాతన పద్ధతిలో (హైహీల్స్, లిప్‌స్టిక్, జబ్బలపైకి చోళీ) కలిపి, తూర్పు పశ్చిమాల కలయికను గుర్తుకు తెచ్చింది. ఇంకా అలా చూస్తూనే ఉండిపోయాను.

"'ఏమయ్యోయ్ పండితా — ఈ లోకంలో ఉన్నావా? — అలా గుడ్లప్పగించి చూస్తావేం! ఇంత అర్ధరాత్రి నువ్వు



శ్రమపడి వచ్చినందుకు ఫలితం దక్కింది చూశావా? అన్నట్టు నువ్వుతెచ్చిన బహుమతి ఇవ్వు,' అన్నాడు విలాసరావు.

"నాకు ఆశ్చర్యం వేసింది. నేను ఖాళీ చేతులతో వచ్చానని తెలిసికూడా, విలాసరావు నన్ను అవమానపరచటం నేను సహించలేకపోయాను.

"'నేను... నేనూ...' అన్నాను.

" 'ఓః అయామ్ సారీ. బహుమతి నా చేతిలో పెట్టి గొణుగుతా వేమయ్యా! అది ఆమెది,' అంటూ నాకు ఆమెచేతిలో తెచ్చిన పాకెట్ పెట్టాడు. పైగా నా చేయెత్తి ఆ బహుమతిని ఆమెచేతిలో ఉంచాడు. 'థేంక్యూ' అంది ప్రతిమా దేవి.

"నాకు మరీ ఆశ్చర్యం వేసింది. నేను తీసుకువెళ్ళని బహుమతిని నేను ఇచ్చినట్టుగా ఇప్పించిన విలాసరావుని ఏమనాలో తెలిసిందికాదు. నోటంట మాట లేకుండా అలానే గుడ్లప్పగించి చూస్తూండిపోయాను.

"'మీరేం తెచ్చారు?' అని విలాస రావుని విలాసంగా అడిగింది ప్రతిమా దేవి. బహుమతి ఏం తెచ్చారు అని అడగటం అదే నేను ప్రథమంగా వినటం.

" 'నేనే వచ్చేశానుగా,' అని విలాస రావు నవ్విన నవ్వుకి హాలు ప్రతిధ్వనించింది. ప్రతిమాదేవి కూడ పెద్దగా నవ్వింది. ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాకుండా, హాల్లోని ప్రతివక్కరూ నవ్వేశారు.

"తర్వాత రెండు మూడు గంటలు చీట్లాట ఆడాం. విలాసరావు చాల ఓడిపోయాడు. ప్రతిమాదేవి చాల గెల్చుకుంది.

ఇవతలకు వచ్చి కారుస్టీరింగ్ ముందు కూర్చుంటూ 'మొత్తానికి బలేవారండీ మీరు. ఇంతకీ ఆ ఇచ్చింది ఏమిటి?' అన్నాను.

"'పట్టుచీరె.' అన్నాడు విలాసరావు.

"'ఎంత?' అన్నాను.

"'ఆప్రశ్న వేయకూడదు. కాని ఇచ్చింది నీకుకాదు కాబట్టి చెబుతున్నాను. జస్ట్ త్రీథౌజండ్.'

"కారు వెడుతున్నదే కాని భూమి గుండ్రంగా తిరిగిపోతున్నట్టు అనిపించింది నాకు!

* * *

ఆ దర్జాబతుకు విలాసరావు పతనావస్థలో ఉన్నాకూడ అతడి పాతమిత్రులు అతణ్ణి ఆహ్వానించిఉండటంలో విశేషం ఏమీలేదు. కనుక సుబ్బారావు చెప్పిన దానికి నే నేమీ ఆశ్చర్యపడలేదు.

"అతడి స్నేహం అటువంటిది. స్నేహాన్ని, డబ్బుతో తూకం వేయలేం గదా!" అన్నాను.

"నువ్వు పొరబడ్డావ్. పూవు తీగన వున్నప్పుడే దాని అందం. అది రాలిపోతే కనీసం దానిశాఖ పంచుకుపుట్టిన మరో పువ్వుకూడ వంగి దానివంక చూడదు. బల్బు వెలుగుతూన్నంత సేపే దాని కాంతీ, ప్రసారమూనూ. అది ఆరితే అంతా చీకటీ, శూన్యం," అన్నాడు సుబ్బారావు పెద్ద వేదాంతిలా.

"నీకీ వేదాంతం ఎక్కడ అబ్బిందోయ్," అంటూ నవ్వాను.

"అది సరేకాని. విలాసరావు నిన్ను



మరీమరీ అడగమని చెప్పమన్నాడు. అతడి బహిఃప్రాణంట నీవు.'' అన్నాడు సుబ్బారావు.

విలాసరావు చాతుర్యానికి ఆశ్చర్య పోయాను. మనుషుల్ని ఆకట్టుకునే విధానంలో ఆయన ఆరితేరాడు!

''అంతేనా? – ఇక్కడ కొచ్చి నా నెత్తిన వాలుతా నన్నావా?'' అన్నాను.

''ఛ, ఛ – ఆ మాటన్లేదు భాయ్. చాపమీద కూచుంటూ ఏం చేశాడో తెలుసా? – పెట్టె తీసి అందులో మూలగా ఉంచిన ఒక బొమ్మ పైకి తీశాడు. విగ్రహంలాగా ఉంది. అక్కడక్కడా రాళ్ళు పొదిగిఉన్నై. అది పైకి తీసి ఒక నిముషం దానివంక తదేకంగా చూసి పెట్టెమీద పెట్టాడు. నిజం చెప్పొద్దూ – ఆ గదికి ఆ విగ్రహం అతకనే లేదు. దర్జా ఇళ్ళలో ఉండాల్సినవస్తువు. స్థానం తప్పితే రాణించదుచూడూ...''అన్నాడు సుబ్బారావు.

నిజమే మరి – కాని. చుట్టూ అప్పుల తోనూ, అర్ధాకలితోనూ బతుకుతున్నాడనుకున్న విలాసరావు ఆ విగ్రహాన్ని ఇంకా పదిలపరుచుకున్నాడంటే, అతడికి ప్రతిమాదేవి మీది గౌరవానికి ఆశ్చర్య పోయాను.

''వేలెడు పొడుగున ఉన్న ప్రతిమ కదూ?''అన్నాను.

''ఔను, నీవుకూడ చూశావా?'' అనడిగాడు సుబ్బారావు.

ఒక్క చూడటమే కాదు. అది చూసి నప్పుడు మూర్ఛపోయాను. ఆ ప్రతిమ పూర్తి బంగారంతో చేయబడింది. అందులో పొదగబడిన రాళ్ళు వజ్రాలూ, కెంపులూనూ. ఆ సంగతి సుబ్బారావుకు ఏం తెలుస్తుంది!

"ఆ ప్రతిమ ఖరీదు ఎంతో తెలుసా?'' అన్నాను.

"ఐదారు వందలు ఉండవచ్చేమో!" అన్నాడు సుబ్బారావు. ఖరీదైన వస్తువుని ఇట్టే అంచనా కట్టటం అతడికి మొదటి నుంచీ అలవాటు.

ఐదారు వందలు కాదు. ఐదారు వేలకు కూడా రాదు. అది ఎక్కడిదో తెలుసా – ప్రతిమాదేవిది. అంటే నువ్వెరగవేమోలే. ఆమె జన్మించిన తర్వాతనే ఈ ప్రపంచం ఇంత అందంగా తయారైంది – ఇంత వెలుగు నింపుకుంది. ఆ ప్రతిమను ఆమె వద్ద చూసీ చూడటంతోనే విలాసరావు మోజు పడ్డాడు. అది తన కిమ్మని ప్రాధేయ పడ్డాడు. ఎంతైనా ఢబ్బిస్తా నన్నాడు. ససేమిరా ఇవ్వనన్నది ప్రతిమాదేవి. మారాం చేశాడు. కోపడ్డాడు. భయ పెట్టాడు. చూస్కో, దాని బాబులాంటిది తెస్తా నన్నాడు. కాని ఆమె మాత్రం అది ఇవ్వలేదు. కోటిమూర్తితో చెప్పి కొరత వేయిస్తా నన్నా ఆమె ఇవ్వలేదు. వారం రోజుల తర్వాత ఆ ప్రతిమను విలాసరావువద్ద చూసి విస్తుపోయాను.

'ఎలా సంపాదించా'వని అడిగాను. 'ఇవ్వ కేమీ చేస్తుంది కాస్త గారం చేసింది. అంతే–దాన్ని చూస్తూ గంటలూ రోజులూ గడిపేయగలను ఆ ప్రతిమ వెనకాలే నవ్వుతూన్న ప్రతిమాదేవికూడ కన్పిస్తుంది తమాషా,' అన్నాడు నీవు నమ్మవేమో కాని ఆ ప్రతిమనుంచి నేనూ కళ్ళు తిప్పుకోలేకపోయాను. దాని వెనకాల నాకూ ప్రతిమాదేవి కనుపించింది హాయిగా నవ్వుతున్నది ఆ విలువగల ప్రపంచంలో ఎక్కడా లేదోయ్." అన్నాను

మనసుకు ఉల్లాసాన్ని కలిగించే ఆ ప్రతిమను ఇంకా విలాసరావు అట్టే పెట్టుకున్నాడంటే నిజంగా అతడూ మనిషి! ఆ ప్రతిమను ఒకప్పుడు నేనడిగితే ఇవ్వలేదు. తన ఎత్తు బంగారానికి లొంగని మనిషికూడ అతడు.

నాకు ఛటుక్కున ఒక ఆలోచన కలిగింది.

ఆ ప్రతిమ నాకు దక్కే చక్కటి సమయం ఇదే!

దుర్భరావస్థలో ఉన్న విలాసరావు డబ్బుకు లొంగకపోతాడా! ఆ ప్రతిమ నాకు కాకుండా పోతుందా

ఆ ప్రతిమను దక్కించుకోవాలన్న కోరిక నాలో ఉరకలు వేసింది

మర్రోజే మద్రాసు ప్రయాణమయ్యాను. విలాసరావు గది కనుక్కోవటం సులువుగానే జరిగింది. అదృష్ట వశాత్తూ విలాసరావు అప్పుడు గదిలోనే ఉన్నాడు నన్ను చూసి వెర్రి ఆనందంతో గంతు వేశాడు "రా, పండితా, రా– ఎన్నాళ్ళకయ్యా నీ దర్శనం,'' అని చాప వేసి కూచోపెట్టాడు.

ఎదురుగా పెట్టెమీద ఆ ప్రతిమ!

ఆ వెనకాలే నవ్వుతూన్న ప్రతిమాదేవి!

కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నాను. అరగంటపేపు చెప్పింది చెప్పకుండా చెప్పుకుపోతున్నాడు విలాసరావు. కాని నా కేమీ వినిపించటం లేదు

"ఇది ఇంకా నీ వద్దే ఉన్నదీ,'' అన్నాను ప్రతిమ వంకే చూస్తూ

"నా గుండెకాయి నా వద్ద కాక పరాయిచోట ఉంటుందా పండితా!'' అన్నాడు నవ్వుతూ.

బయట ఎవడో ఉప్పులవాడు.

రెండు నిముషాల్లో వాణ్ణి పంపేసి తిరిగి వచ్చాడు విలాసరావు

నాకు తగిన సమయం దొరికింది మెల్లిగా అతణ్ణి కదిపాను

'చూడు విలాసరావూ నీవి రెండు జీవితాలు చూశాను. నాకు బాధగా ఉన్నది. ఎంతకాలం ఇలా అవస్థలు పెంచుకుంటావ్...నా మాట విను."

"ఏం చేయమంటావ్–నా కేం సుఖంగానే వున్నాను.'' అన్నాడు. అతడు

కనుబొమ్మలు చిట్లించుకున్నట్టు గమనిం చాను."

''అదే నే నంటున్నది. ఒక్కమాట ఊహాలోకంలోంచి దిగిరా. ఈ జీవితాన్నుంచి బయటపడే మార్గం చూసుకో. అందుకు ముఖ్యం ఏమిటో తెలుసా?— డబ్బు!"

"అది నే నెరగననా నీ ఉద్దేశం! అది ఇచ్చేవా డెవడు?" అన్నాడు.

''నే నిస్తాను. నీ అప్పులు తీరిపోతై. నీ పూర్వజీవితం కాకపోయినా, ఇప్పటి కన్నా దర్జాగా బతకగలవు. పాత జీవితాన్ని నెమరువేసుకోకు ఆ ప్రతిమ గురించి మరచిపో—వీలైతే దాన్ని దూరంగా ఉంచేయ్. పోనీ నాకు ఇవ్వు.'' మంచి సందర్భంలో ఆ ప్రతిమను అడిగాను.

కాని విలాసరావు వేదాంతిలా నవ్వాడు.

"ఆ ప్రతిమను ఎలా వదులుకోనయ్యా పండితా?" అన్నాడు.

"పోనీ నాకు అమ్మ.''

''పండితా," అని పొలికేక పెట్టాడు విలాసరావు. క్షణంలో అతడు కోపంతో ఎరుపెక్కాడు.

వెంటనే నేను సమర్థించుకోవటం మొదలెట్టాను.

"ఆ ప్రతిమ అంటే నాకు ఎంత మోజో, బహుశా నీకు తెలియదేమో— నీ నుంచి అది పొందాలని ఎన్నిసార్లు ప్రయత్నించానో నీకు గుర్తు లేదేమో. నీకు ప్రస్తుతం డబ్బు కావాలి. నాకు ఆ ప్రతిమ కావాలి డబ్బు నే నిస్తాను. ప్రతిమ నాకు ఇవ్వు...'' అన్నాను.

"చూడు పండితా! నేను డబ్బురీత్యా దిగజారిపోయానేమో కాని మానసికంగా కాదు ప్రతిమాదేవిని నేను అమ్మలేను. చనిపోయిన ఆమె ఆత్మ ఘోషిస్తుంది. కాని ... కాని ఈ ప్రతిమమీదే అంత మోజుగా ఉంటే తీసుకో,'' అని ఆ ప్రతిమను తీసి నా చేతిలో పెట్టాడు.

నేను ఆశ్చర్యపోయాను. జరుగుతున్నది నేను నమ్మలేకపోయాను. ఆతృతగా ఆ ప్రతిమను తీసుకున్నాను.

నేను తెచ్చిన డబ్బు తీసి అతడికి ఇవ్వబోయాను.

అతడు అరచిన అరుపు నే నిక్కడ వర్ణించలేను వెంటనే ''ఛీ ..ఛీ...'' అని తనలో తనే గొణుకున్నాడు

''ఇక వెళ్ళు పండితా!...''అని నన్ను ఇవతలకు సాగనంపి ఫెడీమని తలుపు లోపలవేస్తున్నాడు. గడియపెట్టుకోడానికి

అప్పుడే వెనక్కుతిరిగి చూశాను.

అతడి కళ్ళలోంచి ధారాపాతంగా నీరు కారుతున్నది.

---